అన్నీ సీజ్ చేయరా.. ?



సిద్ధిఖీనగర్‌లో ఒరిగిన భవనం పక్కనే నిర్మితమవుతున్న భవనం

అక్రమ నిర్మాణాల పట్ల అధికారుల తీరుపై విమర్శలు

- ఇప్పటికీ కొన్నింటికి నోటీసులు ఇవ్వలేదంటున్న స్థానికులు
- సిద్ధిఖీనగర్‌లో కొందరినే టార్గెట్ చేశారని విమర్శలు

గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్‌లో పక్కకు ఒరిగిన ఓ భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే తొలగించారు. ఆ తర్వాత అదే ప్రాంతంలో ఉన్న అక్రమ నిర్మాణాల లెక్క తేల్చేందుకు సర్వే కూడా చేశారు. కానీ అక్రమ నిర్మాణాలు ఎన్ని ఉన్నాయో, ఏఏ చర్యలు తీసుకుంటారో ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు. ఈ నెల 12న పోలీసు బందోబస్తుతో శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సిబ్బంది భవనాలను సీజ్ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ఆ రోజు మొత్తం ఆరు భవనాలను సీజ్ చేశారు. ఆ తర్వాత మళ్లీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు వెళ్లలేదు.

20 భవనాలకు మాత్రమే నోటీసులు

రెండు నెలల క్రితం సిద్ధిఖీనగర్‌లో 20 అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. తాజాగా సర్వే చేసిన తర్వాత ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. పాత నోటీసుల ఆధారంగానే సెలక్టెడ్‌గా కొన్ని భవనాలు సీజ్ చేయడం విమర్శలకు తావిస్తోంది. భవనం ఒరిగిన చుట్టుపక్కల ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి. అంతే కాకుండా మరోచోట 200 చదరపు గజాల స్థలంలో ఏకంగా జీ ప్లస్ 7 అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. అక్కడా ఎలాంటి చర్యలు లేకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాల సంఖ్య 50 వరకు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. సర్వే చేస్తుండగానే కొందరు వైట్‌వాష్ వేసి నివాసముంటున్నారు. అలాంటి వాటి వైపు జీహెచ్‌ఎంసీ అధికారులు వెళ్లకపోవడం గమనార్హం. సీజ్ చేసిన భవనం ముందు ఉన్న ఓ అక్రమ నిర్మాణాన్ని చూసీ చూడనట్టు వదిలేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అన్ని అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆ భవనంతోనే..

నవంబర్ 19న సిద్ధిఖీనగర్‌లో స్వప్న ప్లాట్ నంబరు 1639లో 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన జీ ప్లస్ 4 అంతస్తుల భవనం ఒరగడంతో పెద్ద ముప్పు ముంచుకొచ్చిందనే చర్చ జరుగుతోంది. అండర్ సెక్షన్ 451/ఏ జీహెచ్‌ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం అక్రమ నిర్మాణాలను సీజ్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. దీంతో కొందరు అక్రమార్కులు పైరవీలకు తెరతీశారు. స్థానికులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి సీజింగ్ చర్యలు లేకుండా చూడాలని మొరపెట్టుకున్నారు. మరికొందరు మరో అడుగు ముందుకేసి నోటీసులు ఇవ్వకుండా, నోటీసులు ఇచ్చినా సీజ్ చేయొద్దని టౌన్‌ప్లానింగ్ అధికారులతో బేరసారాలకు దిగుతున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.



సిద్ధిఖీనగర్‌లో జీ ప్లస్ 7 అంతస్తుల నిర్మాణం

ఆక్యుపేషన్‌లో ఉన్నా సీజ్ చేస్తాం

జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్ధిఖీనగర్‌లో సీజింగ్ ప్రక్రియ మొదలు పెట్టామని శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ పేర్కొన్నారు. కోర్టు కేసులు, బందోబస్తు కారణంగా సీజింగ్ నిలిచిపోయిందని చెప్పారు. ఇటీవల నిర్మించిన అన్ని అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తామని, ఆక్యుపేషన్‌లోకి వెళ్లినా సీజ్ చేయాలనే స్పష్టమైన ఆదేశాలున్నట్టు ఆయన వివరించారు. అన్ని అక్రమ నిర్మాణాల పట్ల ఒకే విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. - ఏసీపీ వెంకటరమణ

మోడల్ రోడ్డు .. చూడముచ్చటగా



మోడల్ రోడ్డు ఆకర్షణీయంగా తయారైంది. దాబా (మధురానగర్) కూడలి నుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్ అండర్‌బ్రిడ్జి వరకున్న రోడ్డును రూ.45 కోట్లతో ఆరులేన్లు వేసి మోడల్‌రోడ్డుగా మార్చారు. డివైడర్‌పై గ్రీనరీ మధ్యలో ఆకట్టుకునేలా రంగురంగుల బల్బులను ఏర్పాటు చేశారు. ఇవి గుండ్రంగా తిరుగుతూ వివిధ రంగుల కాంతులు వెదజల్లుతుండడంతో ఈ రోడ్డు చూడముచ్చటగా ఉంది. ఈ లైటింగ్ ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. - రాయదుర్గం

శేరిలింగంపల్లిలో రేషన్ షాపు తనిఖీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రశాంత్‌నగర్‌లోని రేషన్‌షాపును సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రశాంత్‌నగర్‌లోని రేషన్‌షాపు నంబర్ 135పై ఈ నెల 10వ తేదీ ఫిర్యాదులు రావడంతో సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో బృందం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్‌షాపులో ఇతర వస్తువులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కార్డుదారులపై ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామని వివరించారు. రికార్డులను స్వాధీనం చేసుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ. మొయినుద్దీన్, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ సాయి చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్‌లోని రేషన్ షాపును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హుడా పార్కు .. వాహనాల పార్కింగ్





ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా పార్కులో వాహనాల పార్కింగ్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా పార్కు వాహనాల పార్కింగ్, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. హుడా పార్కులో గతంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. కోచ్ లేకపోవటంతో ఉదయం వేళల్లో స్థానికంగా ఉన్న పాఠశాల విద్యార్థులు ప్రార్థన చేసుకోవటం, సాయంత్రం స్థానికులు ఆడుకోవటానికి ఉపయోగపడేది. షటిల్‌కోర్టులో కోచ్ లేకపోవటంతో ఆ షటిల్ కోర్టులోని పరికరాలు కనుమరుగయ్యాయి. పోకిరీలకు ఆవాసంగా మారింది. దాని పక్కనే ఉన్న మరో పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో స్థానికులు కార్లు, డీసీఎంలు పార్కు చేసుకోవటంతో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. రాత్రి 12 వరకు మందుబాబులు తిష్టవేసి గొడవలకు దిగుతున్నారని స్థానికులు వాపోయారు. సుమారు 4 ఎకరాలు స్థలంలో 2 ఎకరాల్లో పార్కు అభివృద్ధి చేశారు. కొంత స్థలంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేయగా ఉన్న ఖాళీ స్థలం పోకిరీలకు, పార్కింగ్‌కు నెలవైంది. ఇక కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పార్కును అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని స్థానికులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 20, పచ్చిమిర్చి 40, బెండ 60, కాకర 50, దొండ 60, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 70, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 30, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

ఫాతిమాకు పీహెచ్‌డీ ప్రదానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పరిశోధక విద్యార్థిని సహిద్‌ఫాతిమా కంప్యూటేషనల్ డిజైన్, సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ యాంటి డిప్రెసెంట్ మాలిక్యూల్స్' అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసీమ్ ఉల్లా, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కో పర్యవేక్షకులు, ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎం విజులత పర్యవేక్షణలో థీసిస్‌ను సమర్పించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన పానుగొంటి నర్సింహారావుకు మంజూరైన రూ. 33 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రూ.1500 జరిమాన, అదేవిధంగా మరో ముగ్గురికి రూ .2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు కుష్బూ స్కాలర్‌షిప్



బీటెక్ విద్యార్థులకు చెక్కులు అందజేసిన సైబేజ్ ఐటీ కంపెనీ ప్రతినిధులు

గచ్చిబౌలి: సైబేజ్ ఐటీ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం స్కాలర్‌షిప్‌లు అందజేసింది. గచ్చిబౌలి పరిధి డీఎల్‌ఎఫ్‌లోని సైబేజ్ ఐటీ కంపెనీ కుష్బూ స్కాలర్‌షిప్ ద్వారా కండ్లకోయలోని సీఎంఆర్, మేడ్చల్ జిల్లాలోని ఎంఎల్‌ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన 19 మంది బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రూ.30.30 లక్షల కాలేజీ, హాస్టల్ ఫీజును అందించింది. ఈ సందర్భంగా కంపెనీ అధికారి సురేష్ మామునురు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బీటెక్ పూర్తయ్యే వరకు ఫీజులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ కాలేజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ట్రెనింగ్‌హెడ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీదర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీలో జలమండలి అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కారిస్తామని తెలిపారు. కాలనీలోని మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట కొత్త డ్రైనేజీ పైప్‌లైన్‌కు ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచించారు.

గణేష్‌గడ్డ కిటకిట

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోష్‌జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు.

డివైడర్ పనులు పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ కమాన్ నుంచి కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న రోడ్డు డివైడర్ పనులను ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకుండా డివైడర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వివేకానందనగర్ కాలనీలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ నెలకొంటుందన్నారు. డివైడర్ ఏర్పాటుతో ఉపశమనం లభిస్తుందన్నారు.

శంకుస్థాపన

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డ్ వైఎస్ఆర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజాబాల్ రెడ్డి బుధవారం ప్రారంచారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, ఏఈ కిష్టయ్య, కాలనీ మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాదాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు, వాలంటీర్లు

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మెగా సైబర్‌క్రైమ్ అవేర్‌నెస్ నిర్వహించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండటంతోనే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండవచ్చని ఫ్లెక్సీలు, పోస్టర్‌ల ద్వారా వాలంటీర్లు వివరించారు. గచ్చిబౌలి స్టేడియం, బొటానికల్ గార్డెన్, మాదాపూర్‌లో పాటు పార్కులు, హోటల్స్ వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలకు నైపుణ్య శిక్షణా కేంద్రం

చందానగర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. సంవత్సరానికి 4 బ్యాచ్‌లుగా, ఒక్కొక్క బ్యాచ్‌కు 3 నెలల పాటు శిక్షణ ఉంటుంది. 15–35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులు.

చెత్త .. దోమల సమస్య



నాలా పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్, రాంకీ పెరల్ మధ్యలో ఉన్న నాలా వద్ద చెత్త పేరుకుపోయి దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు, పరిసర ప్రాంతవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నాలా వద్ద ఉన్న చెత్తను వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒక్కసారైనా ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవడంతో బాటు నీటి నిల్వలు లేకుండా తొలగించుకోవాలన్నారు. చెత్తా చెదారాన్ని కాలువలు, చెరువుల్లో వేయకుండా ఆటో రిక్షా కార్మికుడికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల వినతి

కేపీహెచ్‌బీకాలనీ: సమస్యలు పరిష్కరించాలని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రధాన ద్వారం వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

చెత్త.. ఇబ్బందులు..

బాచుపల్లి డంపింగ్ కేంద్రంలో చెత్త పేరుకుపోవడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. డంపింగ్ యార్డు తరలించాలని కోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పీసీబీ కార్పొరేషన్‌కు రెండుసార్లు జరిమానా విధించింది. చెత్త డంపింగ్ యార్డును ఎత్తేయడం పక్కన పెడితే.. నిధుల లేమితో ప్రస్తుతం ఉన్న చెత్తను నెల రోజుల నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించడం ఆపేశారు. దీంతో డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చెత్తను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

జనావాసాల నడుమ చెత్త కుప్పలు

- గతంలోనే డంపింగ్ కేంద్రం తరలించాలని కోర్టు, పీసీబీ ఆదేశాలు
- తరలింపు జాప్యంతో ఇప్పటికే రెండుసార్లు కార్పొరేషన్‌కు జరిమానా

నిజాంపేట్: నాడు గ్రామ పంచాయతీలుగా ఉన్న బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌ల నుంచి తరలించిన చెత్తను డంపింగ్ చేసేందుకు సర్వే నెంబర్ 186లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేషన్ ఏర్పడిన తరువాత రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో డంపింగ్ యార్డు జనావాసాల మధ్యన చేరింది. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం వాసులు, సాయినగర్, ఆదిత్య గార్డెన్స్, హిల్ కౌంటీ, స్ప్రింగ్ వ్యాలీ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీల ప్రజలు డంపింగ్ యార్డు మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిన చెత్త తరలింపు

ప్రతి రోజు నిజాంపేట్ కార్పొరేషన్‌లోని వివిధ కాలనీల నుంచి సుమారు 120 టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు చేరుతోంది. ఈ చెత్తను ఇక్కడి నుంచి టిప్పర్‌లలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలి. చెత్త తరలించే టిప్పర్‌లకు ఒక్కో దానికి సుమారు రూ.8,600 చెల్లిస్తూ ప్రతి నెల నెల రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. అయితే నిజాంపేట్ నుంచి చెత్త తరలించే కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో చెత్త తరలింపును నిలిపివేసినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్తను ప్రాసెస్ చేయడానికి చెల్లించాల్సిన నిధులు రూ.5 కోట్ల వరకు నిజాంపేట్ కార్పొరేషన్ పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది.



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

తగులబడుతున్న చెత్త

డంపింగ్ యార్డులోని చెత్తలో తరచు మంటలు రావడంతో వాయు కాలుష్యం ఏర్పడి విష వాయువులతో ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. చెత్తను కావాలనే తగులబెడుతున్నారా? లేక రసాయన చర్యల వల్ల చెత్త తగులబడుతుందా? అనేది తెలియాల్సి ఉంది. గతంలో చెత్తను తగులబెడుతున్న పలువురిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు హిల్ కౌంటీవాసులు పేర్కొంటున్నారు.ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



యార్డు నుంచి బయటకు వచ్చిన చెత్త

తరలింపులో నిర్లక్ష్యమెందుకు?

బాచుపల్లి సర్వే నంబర్ 186లోని చెత్త డంపింగ్ యార్డు తరలించాలని హిల్ కౌంటీవాసులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. వారు సమస్యను పరిష్కరించలేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో డంపింగ్ యార్డును తరలించాని కోర్టు 2022లో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదేశించింది. అంతే గాకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సైతం పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పీసీబీ 6 నెలల్లో డంపింగ్ యార్డును తరలించాలని అధికారులను ఆదేశించింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు రెండుసార్లు రూ.25 వేల చొప్పున జరిమానా విధించింది.

ఇబ్బందులు పడుతున్నాం.. తరలించాలి



చెత్త డంపింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని ఎంపిక చేయాలి. ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలుమార్లు అన్ని విభాగాల అధికారులకు ఫిర్యాదు చేశాం.

- రాజేందర్‌రెడ్డి, హిల్ కౌంటీ విల్లాస్ చైర్మన్

నెల రోజుల్లో తరలిస్తాం



డంపింగ్ యార్డును తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నాం. దుండిగల్‌లోని రాంకీలో లేదా కూకట్‌పల్లిలోని జీహెచ్‌ఎంసీ స్థలంలో డంపింగ్ యార్డు కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఈ రెండింటిలో ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు షిఫ్ట్ చేస్తాము. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. నెల రోజుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- సాబేర్ అలీ, కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్